క్లుప్తంగా

మానసికోల్లాసానికి పల్లె క్రీడలు దోహదం

ఆకివీడు: పల్లె క్రీడలు బాలబాలికల్లో ఉత్సాహాన్ని నింపుతాయని, మానసికోల్లాసానికి దోహదపడతాయని వ్యాయామ ఉపాధ్యాయురాలు నీలవేణి చెప్పారు. మండలంలోని అజ్జమూరు గరువు ఎంపీపీ పాఠశాలలో బుధవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా క్రీడోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యంలోనే దేహం, మనస్సు దృఢంగా ఉండే విధంగా ఆటలు ఆడాలని సూచించారు.

పుస్తకాల అందజేత

భీమవరం: విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని సినీహీరో నిఖిల్ అన్నారు. బుధవారం భీమవరం వచ్చిన సందర్భంగా స్థానిక ఆర్‌హెచ్‌ఆర్ మునిసిపల్ స్కూల్లో విద్యార్థులకు పట్టణానికి చెందిన రక్షాదళ్ సేవా సంస్థ అధ్యక్షుడు మంగదొడ్డి మహేంద్రతో కలిసి విద్యాసామగ్రి అందజేశారు.

మొక్కల పంపిణీ

భీమవరం: మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని డీఎన్నార్ కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు అన్నారు. బుధవారం డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో తైవాన్ జామ మొక్కలను పంపిణీ చేశామని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికల పల్లారావు తెలిపారు. కార్యక్రమంలో పి.సీతారామరాజు, జాలీవాకర్ అప్పలరాజు, భీమాల శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

నూతన భవనంలో వైద్య సేవలు

కాళ్ల: మండలంలోని పెదఅమిరం గ్రామంలో నూతనంగా నిర్మించిన హెల్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో బుధవారం నుంచి వైద్యసేవలు అందుబాలోకి తెచ్చారు. గ్రామంలో నిర్మించిన హెల్త్ సెంటర్‌లో ప్రజల సౌకర్యార్థం వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వినియోగించుకోవాలని కాళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సరాబు సునీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ కోర రామమూర్తి, నడింపల్లి సుబ్బరాజు, వార్డు సభ్యుడు అలుగు సెబాస్టియన్, స్థల దాత ముదుండి లక్ష్మీ నర్సింహరాజు పాల్గొన్నారు.

దళితవాడల్లో పారిశుద్ధ్య పనులు



కోరుకొలులో మురుగు నీరు తొలగిస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

పాలకోడేరు: మండలంలోని కోరుకొల్లు, శృంగవృక్షం దళితవాడల్లో పారిశుద్ధ్య పనులను బుధవారం అధికారులు ప్రారంభించారు. దళితవాడలో రోడ్లపైనే మురుగునీరు అనే శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. ఆయా ప్రాంతాల్లో మురుగు నీరు తొలగింపు, బ్లీచింగ్ చల్లిస్తూ పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టారు. దళితవాడల్లో పారిశుద్ధ్య సమస్యలపై స్థానికులను అడిగి వివరాలను తెలుసుకున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

భీమవరం అర్బన్: భీమవరం మండలం వెంప గ్రామంలోని జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వెంపలో బుధవారం సీపీఎం నాయకులు, కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. భారీ వర్షాలకు కాలనీలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తోటి సుభాకర్‌రావు, తొత్తరపూడి మేరీ, సిర్ర వీరబాబు, ఈపే సత్యవతి, ఈద భూషణం పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

భీమవరం: భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉండి రోడ్డులో ఉన్న భవిత మానసిక వికలాంగుల కేంద్రంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ మాట్లాడుతూ మానసిక వికలాంగులకు మండల న్యాయ సేవాసంస్థ అండగా ఉంటుందని, న్యాయ సహాయం అవసరమైతే తమను సంప్రదించవచ్చని తెలిపారు. మానసిక వికలాంగుల యోగక్షేమాలు, విద్యా వికాసం గురించి సంస్థ హెచ్‌ఎం కె.బేబి కుమారి వివరించారు. కార్యక్రమంలో మట్టా చంద్రశేఖరబాబు, ఎస్ సుధీర్, పి.అంబేద్కర్, బి.సురేష్ కుమార్, బి.లోకేశ్వరరావు, కె.జ్యోతి, ఎంబీ భవాని, ప్రసన్న, ఆర్ లిల్లీ గ్రేస్, వై.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలి

వీరవాసరం: విద్యార్థులంతా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై పి.రమేష్ సూచించారు. స్థానిక ఎంఆర్‌కే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన చట్టాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. బాలికలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే పోలీసుకులకు సమాచారం ఇవ్వాలని కోరారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాపై మాట్లాడని కూటమి పార్టీలు

ఉండి: కేంద్ర బడ్జెట్ సందర్భంగా పార్లమెంట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలపై అధికార టీడీపీ, జనసేన పార్టీలు ఎందుకు మాట్లాడలేదు? అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీఎన్వీ గోపాలన్ మండిపడ్డారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపుల అన్యాయం జరిగిందంటూ సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఉండి సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వంతో పాటు టీడీపీ, జనసేన పార్టీల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ గతంలో బీజేపీ ఒంటరిగానే ప్రభుత్వాలు ఏర్పాటు చేసి ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు పూనుకుందన్నారు. కానీ ఇప్పుడు టీడీపీ, జనసేన సహకారంతో ఏర్పడిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే ఎలా చూస్తూ ఉండిపోయారని చంద్రబాబు,పవన్‌కల్యాణ్‌లను గోపాలన్ ప్రశ్నించారు. రాష్ట్ర రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయిస్తున్నామని చెప్పిన ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ వాటిని బడ్జెట్‌లో చూపించలేదని అన్నారు.అంటే నిధులు కేటాయిస్తున్నారా? లేక అప్పుగా ఇస్తున్నారా? అనేది ప్రజల్లో అనుమానం కలుగుతుందన్నారు. పోలవరం నిర్మాణానికి రూ.12 వేల కోట్లు కావాలని రాష్ట్రం కోరినా కేటాయించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొట్టాడ వెంకటేశ్వరరావు, రామకూరి వెంకటరత్నం, కింతాడ రమేష్, వీరవల్లి శ్రీనివాస్, మోపిదేవి రాము, తదితరులు పాల్గొన్నారు.



ఉండి: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోపాలన్



ఆకివీడు: వైఎస్సార్ సెంటర్‌లో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆకివీడులో..

ఆకివీడు: కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వం సంక్లిష్ట బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బీజేపీ కూటమికి వ్యతిరేకంగా స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. పూర్తి చేస్తామని చేసిన హామీకి సీఎం చంద్రబాబు సంబరపడిపోతున్నారని ఆరోపించారు. ఎప్పటికి పూర్తి చేస్తారో? చెప్పలేదన్నారు. పోలవరం పునరావాస బాధితుల్ని మరిచిపోయారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు పెంకి అప్పారావు, బీవీ వర్మ, సందక సూరిబాబు, ఉత్తరావల్లి రమణ, మనిపూరి సత్యనారాయణ, పంపన రమణ, ఎన్ని సూరిబాబు, డోలా సూరి, మల్లేశ్వరావు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులపై కేసుల నమోదు

ఉండి: అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న భర్త,అత్త, ఆడపడుచుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి కాపులపేటకు చెందిన పులి కనక దుర్గకు ఆ భర్త రాఘవేంద్రకు 2016లో వివాహమైంది.అప్పటి నుంచి భర్త రాఘవేంద్ర, అత్త కనకదుర్గ, ఆడపడుచు స్వర్ణలత అదనపు కట్నం తేవాలంటూ వేధింపులకు గురి చేయడంతో కనకదుర్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహదేవపట్నంలో

ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన తంగెళ్ళ సుశీలను ఆమె భర్త పెద్దిరాజు, అత్త దానమ్మ, మావయ్య వెంకటేశ్వరరావు అదనపుకట్నం తేవాలంటూ వివాహమై 13 ఏళ్లు గడిచి కుమార్తె పుట్టినా గానీ వేధింపులకు గురి చేస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై ఎం లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన



ఆకివీడు: చెరుకుమిల్లి జెడ్పీ స్కూల్‌లో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



ఉండి: మహదేవపట్నం జెడ్పీ హైస్కూల్‌లో బాలికలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల

ఆకివీడు: బాల్య వివాహాలతో అధిక ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి చెప్పారు. మండలంలోని చెరుకుమిల్లి, కమతవాని గూడెం గ్రామాల్లో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహనా సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలకు పెళ్లి చేయడం వల్ల అత్తారింటిలో వచ్చే సమస్యలతో పాటు, బాలికకు శారీరక, మానసిక ఇబ్బందులు అనేకం వస్తాయని చెప్పారు.

ఉండిలో..

ఉండి: నేటి బాలికలే రేపటి మహిళలు కనుక అనుకున్నది సాధించాలంటే చదవుతోనే అది సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ డీ నిర్మల అన్నారు.బుధవారం మహదేవపట్నం జెడ్పీ హైస్కూల్‌లో పీఎం మిషన్ కార్యక్రమంలో బాగంగా కిశోర బాలికలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ విద్య,ఉద్యోగం వంటివి సాధించినప్పుడే మహిళలు అన్ని రంగాల్లోను ముందుంటారని అన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు బీవీ లక్ష్మీ, కుసుమ కుమారి, కె.లలిత, టి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో గురువారం 11 కేవీ హైటెన్షన్ వైర్లపై చెట్ల కొమ్మలు తొలగించేందుకు, వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్‌అహ్మద్ ఖాన్ తెలిపారు యనమదుర్రు, కట్టావారిపాలెం, దిరుసుమర్రు హైస్కూల్ సెంటర్, సంతోషపురం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి బడ్జెట్‌లో ఆదరణ

భీమవరం: కేంద్ర బడ్జెట్‌లో అన్నివర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరే విధంగా రూపకల్పన చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. బుధవారం భీమవరంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. యువత, మహిళలు, నిరుద్యోగులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఉపాధి, ఉద్యోగ కల్పనకు ఎక్కువ నిధులు కేటాయించడం శుభపరిణామన్నారు. నాయకులు పేరిచర్ల సుభాష్, ఉన్నమట్ల కపర్ది, కాయిత సురేంద్ర, ఎస్ సోమేశ్వరరావు, కోమటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ

భీమవరం: విపత్తుల పరిస్థితిల్లో బాధితులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, పాత్తూరి బాపిరాజు అన్నారు. భీమవరం 2వ వార్డులోని మెంటేవారితోట పరిధిలో భారీ వర్షాలు, వరదనీటికి ముంపునకు గురైన బాధితులకు శ్రీవిజ్ఞానవేదిక, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తనయుడు ప్రశాంత్ సహకారంతో ఏర్పాటుచేసిన భోజనం ప్యాకెట్లు, పాత్తూరి బాపిరాజు ఆర్థిక సాయంతో సమకూర్చిన స్టీల్ కంచాలు, గ్లాసులు బుధవారం పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న ప్రవచనాలు

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామంలో ఉన్న జనార్దన స్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఆలయం వద్ద ప్రముఖ ఉపన్యాసకర్త అల్లూరి వెంకట్రాజు ప్రవచనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే 26న ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ నిర్వహించనున్నామని స్పష్టం చేశారు.

రజకుల సమస్యలపై వినతి

భీమవరం: రజకుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజకజన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. బుధవారం ఆకివీడు, పాలకోడేరు, ఉండి మండలాల్లోని పలు గ్రామాల రజకుల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని భీమవరం కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ అధికారి విక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రజకుల వృత్తి చెరువుల కేటాయింపులో జీఓలను అమలు చేసేలా శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. రజకుల చెరువులకు లీజులు పెంచడం, ఆక్రమణ గురికావడంతో వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చెరువుగట్టు చుట్టూ ఫెన్సింగ్ వేయించి ఆక్రమణలతో రజకులకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు.



డీపీఓ విక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని డీపీఓ హామీ ఇచ్చినట్టు కట్లయ్య చెప్పారు. కార్యక్రమంలో కొమరపురి సూర్యనారాయణ, జీను బాలరాజు, చిటికెల సురేష్, వనపర్తి శ్రీనివాస్, వి.శ్రీనివాసు, పొట్లూరు మురళి తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బివ్వలేదని తల్లిపై దాడి

ఉండి: మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని ఓ వ్యక్తి కన్నతల్లిపైనే దాడికి తెగబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం చిలుకూరు గ్రామానికి చెందిన ఇండిగపల్లి మరియమ్మను ఆమె పెద్ద కుమారుడు కిశోర్ ఈ నెల 22వ తేదీ సాయత్రం 6 గంటలకు మద్యం తాగేందుకు డబ్బులు అడిగాడు. ఆమె డబ్బులు లేవని చెప్పడంతో కర్రతో తలపై కొట్టడంతో ఆమె గాయపడింది. ఆమెను వైద్య చికిత్స నిమిత్తం హుటాహుటిన భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ యెషయా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

ఉండి: మండలంలోని ఓ యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి గ్రామానికి చెందిన గెద్దా శాంతి కుమార్తె నిహారిక మంగళవారం రాత్రి 11:30 గంటల నుండి కనిపించడం లేదని పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తరటావ సర్పంచ్‌గా ఉప సర్పంచ్‌కు బాధ్యతలు

ఆకివీడు: మండలంలోని తరటావ గ్రామ సర్పంచ్ బాధ్యతలను ఉపసర్పంచ్ ముప్పానేని నాగేశ్వరరావుకు అదనపు బాధ్యతలు ఇస్తూ జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారని కార్యదర్శి ఆనంద భూషణం బుధవారం తెలిపారు. సర్పంచ్‌గా కూనపరాజు ప్రసాదరాజు వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్లు తెలిపారు. ఇన్‌చార్జి సర్పంచ్, ఈఓపీఆర్‌డీకి చెక్‌పవర్ ఇస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారని చెప్పారు.

ఉపాధి కోల్పోయిన యానాదులను ఆదుకోవాలి

పాలకోడేరు: భారీ వర్షాలు, వరదల వల్ల ఉపాధి కోల్పోయిన యానాదులను తక్షణం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ కార్యదర్శి జెఎన్వీ గోపాలన్ డిమాండ్ చేశారు. మోగల్లు పంచాయతీ పరిధిలోని గుత్తివారిపాలెంలో ఉన్న యానాదుల నివాస ప్రాంతాలను బుధవారం సీపీఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది వర్షాల వల్ల తమ కాలనీ మునిగిపోతుందని వారు బృందం వద్ద వాపోయారు. వర్షాలు, వరదల వల్ల పనులు లేక తీవ్ర దుర్భర స్థితిని ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. మురుగునీరు నిల్వ ఉండటంతో ఈ ప్రాంతంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్య శిబిరం ఏర్పాటు చేయించాలని కోరారు. దీనిపై ఆయన స్పందించి అధికారులు యానాదుల సమస్యను పరిస్కరించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు ఆశ్రయ, పాల వెంకట స్వామి పాల్గొన్నారు.



ముంపు బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం బృందం

ముంపునీరు తొలగింపునకు చర్యలు

ఆకివీడు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని కాలనీలో ముంపు నీటిని బయటకు పంపించేందుకు చర్యలు తీసుకున్నారు. గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షానికి కాలనీలోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు నడవడానికి వీలులేనంతగా ఆ ప్రాంతం నీట మునిగింది. దీంతో కాలనీలో నివసిస్తున్న ప్రజల ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని ఉపాధి హామీ నిధులతో ఆయా ప్రాంతాల్లో కచ్చా డ్రెయిన్లను గ్రామ కార్యదర్శి ఆనంద భూషణం తవ్విస్తున్నారు. రోడ్లపై పడిన గుంతల్ని సరిజేయిస్తున్నారు. వర్షం తగ్గుముఖం పట్టడంతో ముంపునీరు బయటకు వెళ్లిపోయి, ఆయా ప్రాంతాలు కోలుకొంటున్నాయి. కాలనీలో మంచినీటిని ఆకివీడు నగర పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.



కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని కాలనీలో పనలు చేస్తున్న దృశ్యం

ముంపు వరి నారుమడుల పరిశీలన



పాందువ్వలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాస్, ఏఓ సంధ్య

ఉండి: భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న నారుమడుల స్థానంలో రైతులు స్వల్పకాలిక రకాలను మళ్లీ నారుమడులు వేసుకోవాలని ఆకివీడు సహాయ వ్యవసాయ సంచాలకుడు కేఏఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల వ్యవసాయాధికారి బీ సంధ్య ఆధ్వర్యంలో మండలంలోని పాందువ్వ, ఆరేడు గ్రామాల్లో ముంపు బారిన పడిన వరినారుమడులు, నాట్లు వేసిన వరిపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా వరి పొలాల్లోని నీరు బయటకు పోయేలా రైతులు చర్యలు చేపట్టాలని అన్నారు. అప్పుడు నారుమడి లేదా నాట్లు వేసిన వరిచేను అవకాశం వుంటే కాపాడుకోవచ్చునని అన్నారు. అలాగే రైతులు తమ నారుమళ్లు ముంపునకు గురై పాడైపోతే వాటి స్థానంలో తక్కువ కాలపరిమితి గల రకాలైన 1030,1 212 రకాలు 140 రోజుల్లోనే మంచి దిగుబడి ఇస్తున్నాయని వాటిని నారు పోసుకోవాలని తెలిపారు.

పౌష్టికాహారాన్ని భుజించాలి

వీరవాసరం: మహిళలు పౌష్టికాహారాన్ని భుజించి ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి పి.సుజాతారాణి అన్నారు. వీరవాసరం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కిషోరబాలికలు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు వంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని భుజించాలన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్క బాలికా ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధవహించాలని సూచించారు. కార్యక్రమంలో టీకే లక్ష్మీకాంతం, వి.కనకమహాలక్ష్మి, వి.నాగరత్నం, జేజమ్మ, సీహెచ్‌ఓ దేవదాసు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ సుజాతరాణి

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి

ఆకివీడు: ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించాలని ఎంపీడీఓ వై.రామకృష్ణ సూచించారు. మండలంలోని కుప్పనపూడి, చినకాపవరం, గుమ్ములూరు గ్రామాల్లో బుధవారం ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రోజూ మూడు గ్రామాలలో ఆధార్ అప్‌డేట్ సెంటర్లు నిర్వహిస్తున్నామని, మూడు సంవత్సరాలు పైబడిన వారంతా ఆధార్ కార్డును సంబంధిత సచివాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ అసిస్టెంట్ వద్ద ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 25న పెదకాపవరం, దుంపగడప, అజ్జమూరు, 26న పెదకాపవరం, దుంపగడప, చెరుకుమిల్లి, 27న అప్పారావుపేట, కోళ్ళపర్రు, చెరుకుమిల్లి గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారని వివరించారు. ప్రజలు ఈ ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలని సూచించారు.

ఎంపీడీఓ రమణారావుకు నివాళి

ఆకివీడు: మంచి అధికారి, అందరినీ కలుపుకుని వెళ్లే వ్యక్తి నరసాపురం ఎంపీడీఓ ఎం.వెంకట రమణారావు మృతి తీరని లోటని ఆకివీడు ఎంపీడీఓ వై.రామకృష్ణ చెప్పారు. స్థానిక మండల పరిషత్ హాలులో బుధవారం సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట రమణారావు అకాల మృతి వారి కుటుంబానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీకర్, ఈఓపీఆర్‌డీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ మృతికి సంతాపం

భీమవరం అర్బన్: భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఇటీవల ఏలూరు కాలువలో ఆత్మహత్య చేసుకున్న నరసాపురం ఎంపీడీఓ వెంకటరమణారావుకు సంతాపం తెలిపారు. భీమవరం ఎంపీడీఓ బీకేఎస్ఎస్ వెంకట్ రామన్ వెంకటరమణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



కోమటిగుంటలో దుర్గాదేవికి సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



అమ్మవారికి కలశాలతో గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలో ఉన్న దుర్గాదేవి అమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవ కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీనిలో భాగంగా 108 కలశాలతో మహిళా భక్తులు అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహించి అభిషేకం చేశారు. ఆలయ నిర్మాణకర్తలు ఎరుబండి రామాంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొని ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణకర్తల సహకారంతో అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవార్లకు ఆషాడం సారె సమర్పణ

భీమవరం అర్బన్: భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామ దేవతలు శ్రీ ముత్యాలమ్మ, గరవల్లమ్మ, పర్లమ్మ అమ్మవార్లకు ఆషాఢ మాస సారెను సమర్పించారు. శ్రీ సీతారామ సేవా సమితి ఆధ్వర్యంలో మురళి కోలాటంతో వైభవంగా భక్తులు అమ్మవార్లకు సారెను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఏర్పాట్లను సేవా సమితి సభ్యులు పర్యవేక్షించారు.

విజయవాడ దుర్గమ్మకు చినకాపవరం సారె

ఆకివీడు: విజయవాడ కనక దుర్గమ్మకు మండలంలోని చినకాపవరం గ్రామానికి చెందిన మహిళలు బుధవారం సారె తీసుకువెళ్లి అందజేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు నందమూరి సత్యవతి ఆధ్వర్యంలో 14 మంది మహిళలు సారెను సమర్పించారు. అనంతరం ఆలయం దగ్గరలోని తిరుపతమ్మ అమ్మవారికి సారె సమర్పించి అమ్మవార్లను దర్శించుకున్నారు.



గొల్లవానితిప్పలోఅమ్మవార్లకు సమర్పించిన సారె